ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

మంగళవారం 26 ఆగస్టు 2025

చెన్నైలో రూ.7.75 కోట్లతో జర్నలిజం ఇన్‌స్టిట్యూట్



కోట్టూరుపురం వద్ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జర్నలిజం అండ్ మీడియా స్టడీస్ సెంటర్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమిళభాషాభివృద్ధి సమాచార శాఖ ఆధ్వర్యంలో కోట్టూరుపురం అన్నా శతజయంతి స్మారక గంథాలయం పక్కనే రూ.7.75 కోట్లతో ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జర్నలిజం అండ్ మీడియా స్టడీస్‌ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం నుండే ఈ సంస్థలో పీజీ డిప్లొమా కోర్సు ప్రారంభమవుతుందని ఆయన ప్రకటించారు. ఈ సంస్థలో ముద్రణా రంగం, టీవీ ఛానెళ్లు, రేడియో స్టేషన్లు, ప్రైవేటు ఛానెళ్లలో పనిచేస్తున్న పాత్రికేయులకు అంతర్జాతీయ స్థాయి సిలబస్‌తో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు సామినాధన్, ఎం.సుబ్రమణ్యం, ఎంపీ విజయ్‌వసంత్, డిప్యూటీ మేయర్ ఎం. మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా
సంజయ్ కుమార్

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి సంజయ్‌కుమార్‌ను కొలీజియం సిఫారసు చేసింది. దేశవ్యాప్తంగా 14 మంది హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ఆ ప్రకారం, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి నిషా బాను కేరళ హైకోర్టుకు, అలహాబాదు హైకోర్టు న్యాయమూర్తి సంజయ్ కుమార్‌ను మద్రాసు హైకోర్టుకు బదిలీ చేస్తూ సిఫారసు చేశారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి
రాష్ట్రం నుంచి ఇద్దరు, పుదువై నుంచి ఒకరు



విజయలక్ష్మి - రేవతి

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 45 మంది ఉపాధ్యాయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలు ప్రకటించగా, రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. సెప్టెంబరు 5వ తేది దివంగత మాజీ రాష్ట్రపతి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, దేశవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరిస్తుంది. ఆ ప్రకారం, ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 45 మంది జాబితాను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసింది. జాబితాలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. తిరుప్పూర్ జిల్లా ఉడుమలైలోని భారతీయార్ సెంటినరీ ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మి, చెన్నై మైలాపూర్ పీఎస్ సీనియర్ సెకండరీ స్కూలు ప్రిన్సిపాల్ రేవతి పరమేశ్వరన్ ఎంపికయ్యారు. అలాగే, పుదుచ్చేరి తిల్లైయాడి వెల్లియమ్మై ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రాధాకృష్ణన్ కూడా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారానికి ఎంపికయ్యారు.

వృత్తి శిక్షణ కేంద్రాల్లో మెరుగైన వసతులు

● సీఎం స్టాలిన్ ప్రకటన ● రూ.173.86 కోట్లతో కొత్త భవనాలు



ఉన్నతవిద్యాశాఖ నిర్మించిన భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ వృత్తి శిక్షణా కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, ఆ మేరకు నూతన భవన సముదాయాలు, శిక్షణా కేంద్రాలు నిర్మించినట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. సచివాలయంలో సోమవారం ఉదయం కార్మిక సంక్షేమ నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో రూ.173.86 కోట్లతో నిర్మించిన 19 వృత్తి శిక్షణా కేంద్ర భవనాలు, పెరుంబాక్కం, ఒట్టన్‌సత్తిరం, కడలాడి ప్రాంతాల్లో నిర్మించిన ప్రభుత్వ వృత్తి శిక్షణా సంస్థల భవనాలు, చెన్నైలో నిర్మించిన లేబర్ కమిషనర్ కార్యాలయం తదితర భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన పాత్ర పోషిస్తున్న రాష్ట్రంలో ఆధునిక సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి, మానవవనరులను అభివృద్ధి చేయడానికి ఇప్పటి వరకు రూ.2877 కోట్లతో 71 ప్రభుత్వ వృత్తి శిక్షణా సంస్థలను నెలకొల్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రఘుపతి, ఎంపీ సామినాధన్, ఎస్ఎస్ శివశంకర్, సీవీ గణేశన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి కే వీరరాఘవరావు, కమిషనర్ సీఏ రామన్, ఉపాధికల్పనా శిక్షణా శాఖ సంచాలకులు పి.విష్ణు చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్, డీఎస్పీలకు ఉత్తర్వులు...

సచివాలయంలో జరిగిన మరో కార్యక్రమంలో సబ్ కలెక్టర్, డిప్యూటీ పోలీసుసూపరింటెండెంట్ పోస్టులకు ఎంపికైన 89 మందికి ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సబ్‌కలెక్టర్లుగా ఎంపికైన 15 మందికి, డీఎస్పీలుగా ఎంపికైన 23 మందికి, వాణిజ్యపన్నుల శాఖలో అసిస్టెంట్ కమిషనర్లుగా ఎంపికైన 14 మందికి, సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్లుగా ఎంపికైన 21 మందికి, గ్రామీణాభివృద్ధి సహాయ సంచాలకులుగా ఎంపికైన 14 మందికి, జిల్లా ఉపాధికల్పన అధికారిగా ఒకరు, అగ్నిమాపక జిల్లా అధికారిగా ఒకరికి నియామక ఉత్తర్వులందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి ఎన్.కయల్‌విళి సెల్వరాజ్, మానవవనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి సి.సమయమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ. 51.04 కోట్లతో ఉన్నతవిద్యాశాఖ భవనాలు...

రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ ఆధ్వర్యంలో రూ.51.04 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. సోమవారం ఉదయం సచివాలయం నుంచి మదురై, శివగంగ, పుదుకోట, తిరునల్వేలి, తిరువారూరు జిల్లాల్లో నిర్మించిన ఈ భవనాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి రఘుపతి, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి పి. శంకర్ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ జే ఇన్నోసెంట్ దివ్యా తదితరులు పాల్గొన్నారు.

భారత్‌ను అగ్రగామిగా నిలపాలన్నదే
కేంద్రప్రభుత్వ లక్ష్యం



రోడ్ షో ప్రారంభంలో పాల్గొన్న విశ్వనాథన్, సుశాంత కుమార్, వెంకటేష్, సునీల్ పాలీవాల్ తదితరులు

అడయార్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారతదేశాన్ని ముందంజలో ఉంచాలన్నదే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా ఉందని కేంద్ర నౌకా రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శి టీకే రామచంద్రన్ అన్నారు. ముంబైలో జరుగనున్న మ్యారీటైమ్ వారోత్సవాలను పురస్కరించుకుని చెన్నై పోర్ట్ ట్రస్ట్ సోమవారం నగరంలో రోడ్ షో నిర్వహించింది. ఇందులో 150 మందికి పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యంగా డీసీఐ, సీఎస్ఎల్, ఎస్‌సీఐ, ఇండియన్ మ్యారీటైమ్ యూనివర్సిటీ, అకడమిక్, రీసెర్చ్ సంస్థల ప్రతినిధులు భాగస్వామ్యం అయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర నౌకా రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శి టీకే రామచంద్రన్ ఓడరేవుల మంత్రిత్వ శాఖ చేపట్టిన చర్యలను వివరించారు. కామరాజర్ పోర్ట్ చైర్మన్ సునీల్ పాలివాల్ పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం కోసం తీసుకునే విధానపరమైన నిర్ణయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చెన్నై పోర్ట్ అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్ ఎస్.విశ్వనాథన్, వీవోసీ పోర్ట్ అథారిటీ చైర్మన్ సుశాంత కుమార్ పురోహిత్, తమిళనాడు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ టీఎన్ వెంకటేష్, చెన్నై పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్ సునీల్ పాలివాల్, పీపీపీ జాయింట్ సెక్రటరీ ఆర్.లక్ష్మణన్, ఐఎంసీ చైర్మన్, జేఎస్‌డబ్ల్యూ బోర్డ్ మెంబర్ దేవ్‌కీ నందన్, ఐపీఏ ఎండీ వికాస్ నర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓమందూర్ రామస్వామి రెడ్డికి ఘన నివాళి



రామస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐటీఎఫ్ అధ్యక్షులు సీఎంకే రెడ్డి, నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ ప్రిసీడియం మొట్టమొదటి సీఎంగా వ్యవహరించిన తెలుగు తల్లి ముద్దుబిడ్డ ఓమందూర్ రామస్వామి రెడ్డి సేవలను స్మరించుకోవాలని అఖిల భారత తెలుగు ఫెడరేషన్ (ఏఐటీఎఫ్) అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి తెలుగువారికి పిలుపునిచ్చారు. కీల్పాక్‌లో సోమవారం ఓమందూర్ రామస్వామి రెడ్డి 55వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలుచల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎంకే రెడ్డి మాట్లాడుతూ, మద్రాస్ ప్రిసిడెన్సీలో 1947 మార్చి 23 నుండి 1946 ఏప్రిల్ 6వ తేదీ వరకు ఓమందూర్ రామస్వామి రెడ్డి ముఖ్యమంత్రిగా వ్యవహరించి రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషిచేశారని కొనియాడారు. రాష్ట్రాన్ని ఏడుగురు తెలుగు వ్యక్తులు పాలించి అభివృద్ధి బాటలో నడిపించారని, వారి గురించి భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైన ఉందని, ఇందుకు తెలుగు సంఘాలన్నీ కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకలు డాక్టర్ సీఎం కిషోర్, ఆర్.నందగోపాల్, గొల్లపల్లి ఇశ్రాయేలు, ఎన్.నాగభూషణం, సీహెచ్.తిరుమలరావు తదితరులు పాల్గొని ఓమందూర్ రామస్వామి రెడ్డికి నివాళులర్పించారు.

చెన్నై చేరుకున్న పంజాబ్ సీఎం



పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌కు ఆహ్వానం పలుకుతున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం అల్పాహారం పథక విస్తరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ సోమవారం నగరానికి చేరుకున్నారు. 2022వ సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం అల్పాహారం పథక విస్తరణ కార్యక్రమం మంగళవారం మైలాపూర్‌లో జరుగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానించారు. ఈ కార్యక్రమం కోసం సోమవారం సాయంత్రం నగరానికి చేరుకున్న పంజాబ్ సీఎంకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం సాగర స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా పంజాబ్ సీఎం మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల మధ్య దీర్ఘకాల అనుబంధం ఉందని, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పనలో దేశంలో తమిళనాడు ప్రత్యేక స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు అల్పాహారం పథక విస్తరణ కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందని, ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆనందం వ్యక్తం చేశారు.

జనవరి 9న
డీఎండీకే మహానాడు

● పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత



విజయకాంత్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ప్రేమలత తదితరులు

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జనవరి 9న కడలూరు జిల్లా వేప్పూరు వద్ద డీఎండీకే మహానాడు జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత వెల్లడించారు. కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం ఉదయం జరిగిన విజయకాంత్ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని,పేదలకు సహాయాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ 'ప్రజా హక్కుల సాధన మహానాడు 2.0' పేరుతో కడలూరు జిల్లా వేప్పూరు సమీపం చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలో ఉన్న పాచార్ గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి తానే మహానాడును ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మహానాడులో పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

కావేరి చెక్ డ్యాం...
తుంగలో తొక్కిన డీఎంకే ప్రభుత్వం

● ఈపీఎస్ ఆగ్రహం



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో కావేరి నదీ జలాలు వృథాగా సముద్రంలో కలవకుండా చెక్‌డ్యాంలు నిర్మించేందుకు జారీచేసిన జీవోను డీఎంకే ప్రభుత్వం రద్దుచేసిందని, ఇందువల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు సకాలంలో సాగునీరందక తీవ్రంగా నష్టపోతున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మండిపడ్డారు. వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలను పురస్కరించుకుని 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో గత నెల 7వ తేదీ కోవై మేట్టుపాళయంలో ఈపీఎస్ ప్రారంభించిన ప్రచారయాత్ర సోమవారం తిరుచ్చి జిల్లాలోని మనప్పారై చేరుకుంది. ముందుగా ఆయన ఈ జిల్లాలోని రైతు సంఘాల ప్రతినిధులు, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులు, చేనేత, కుమ్మరి, వడ్రంగి తదితర వృత్తి సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మనప్పారై జంక్షన్ రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడుతూ ప్రజల ఆకలి తీరుస్తున్న అన్నదాత కష్టాలు ఓ రైతుగా తనకు బాగా తెలుసని, ఈ డీఎంకే ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులకు సాగునీటి కొరత లేకుండా ఆయా సీజన్లలో సరఫరా చేయాలన్న దృక్పథంతోనే గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో నీటి నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశామని, అందులో విశేష అనుభవం కలిగిన రిటైర్డ్ ఇంజనీర్లను నియమించామని, ఆ కమిటీ సిఫారసు మేరకు సముద్రంలో వృథాగా కలుస్తున్న నదీజలాలను అడ్డుకునేలా చెక్‌డ్యాంల నిర్మాణం పథకాన్ని రూపొందించామన్నారు. అయితే 2021లో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించిందని, తాము వచ్చే ఏడాది అధికారంలోకి వచ్చాక నాలుగు ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు నిర్మించడంతో పాటు మేట్టూరు డ్యాం సహా 14వేల చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వలను పెంచుతామని ఈపీఎస్ రైతులకు హామీ ఇచ్చారు. రైతులకు లాగే కులవృత్తులలో పాల్గొంటున్న కార్మికులు, అసంఘటిత కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేస్తామని ఎడప్పాడి పళనిస్వామి భరోసా ఇచ్చారు.

చవితి ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా
80 వేల ప్రతిమలకు అనుమతి

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 80వేల విగ్రహాల ఏర్పాటుకు అనుమతులిచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది వినాయక చవితి బుధవారం ప్రజలు జరుపుకోనున్నారు. ఇళ్లలో చిన్న విగ్రహాలు ఉంచి పూజలు నిర్వహిస్తుండగా, యువకులు, ఉత్సవ కమిటీలు, హిందూ సంస్థలు వీధుల్లో విగ్రహాలు ఏర్పాటుచేసి పూజలు నిర్వహిస్తుంటాయి. వినాయక విగ్రహాల ఏర్పాటు, పూజలు, ఊరేగింపు, నిమజ్జనం తదితరాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు నిబంధనలు విధించారు. ఆ ప్రకారం, గ్రేటర్ చెన్నై పోలీసు కార్యాలయం పరిధిలో గత ఏడాది 1,519 విగ్రహాలు ఏర్పాటుచేయగా, ఈ ఏడాది కూడా ఆ స్థలాల్లో మాత్రమే విగ్రహాలు ఏర్పాటుచేసేందుకు అనుమతించారు.. అలాగే, ఆవడి పోలీస్ కమిషనర్ పరిధిలో సుమారు 700 విగ్రహాలు, తాంబరం పోలీసు కమిషనర్ పరిధిలో 600 విగ్రహాలకు అనుమతించారు. ఆ ప్రకారం, బుధవారం నగరం, శివారు ప్రాంతాల్లో సుమారు 3,000 వినాయక విగ్రహాలు ఏర్పాటుకానున్నాయి. 27న ఏర్పాటు చేసే విగ్రహాలకు 30వ తేదీ వరకు నాలుగు రోజులు పూజలు, 31న పట్టినంబాక్కం, శ్రీనివాసపురం, కాశిమేడు ఫిషింగ్ హార్బర్, తిరువొత్తియూర్, నీలాంగరై తదితర ప్రాంతాల్లో విగ్రహాల నిమజ్జనానికి పోలీసులు అనుమతించారు. నగరంలో విగ్రహాల భద్రతకు 16,500 మంది పోలీసులు, 2వేల వేల సాయుధదళాలతో బందోబస్తు కల్పిస్తున్నారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 80వేల విగ్రహాల ఏర్పాటుకు అనుమతించగా, సుమారు లక్ష మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు పోలీసు శాఖ తెలిపింది.

ఏర్పాట్లలో అపశ్రుతి...

రాజధాని నగరం మాధవరం, పూందమల్లి ప్రాంతాల్లో గణేష్ విగ్రహాల కోసం సోమవారం పందిరి నిర్మాణ పనుల్లో పాల్గొన్న ఇద్దరు విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మాధవరం ప్రాంతంలోని రాజాజీవీధిలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గురు కార్మికులు పందిరి ఏర్పాటు చేస్తున్నారు. హఠాత్తుగా విద్యుత్ షాక్‌కు గురై ప్రశాంత్ అనే కార్మికుడు అక్కడికక్కడు మృతిచెందాడు. అదేవిధంగా పూందమల్లి సెన్నీరుకుప్పం ప్రాంతంలో పందిరి నిర్మాణం పనుల్లో పాల్గొన్న భరత్ అనే కార్మికుడు కూడా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సమాచార దృష్టి

5న 'మిలాదున్ నబి'

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5వ తేదీ 'మిలాదున్ నబి' పండుగ జరుపుకోవచ్చని ప్రధాన హాజీ తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని ముస్లిం సోదరులు 'మిలాదున్ నబి'గా పండుగ జరుపుకుంటారు. రాష్ట్రంలో ఆదివారం ఇస్లామిక్ మాసమైన 'రబీ ఉల్ అవాల్' నెల వంక కనిపించింది. అందువల్ల సెప్టెంబరు 5న 'మిలాదున్ నబి' పండుగ జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన హాజీ (బాధ్యత) మహ్మద్ అక్బర్ తెలిపారు.

ఆదివారం టైం టేబుల్‌తో రేపు సబర్బన్ రైళ్లు

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా బుధవారం ప్రభుత్వ సెలవు కావడంతో తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు నడుపనున్నారు. చెన్నై సెంట్రల్-అరక్కోణం, చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట, చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య ఆదివారం టైం టేబుల్ ప్రకారం సబర్బన్ రైళ్లు నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. రిజర్వేషన్ కేంద్రాలు కూడా మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే పనిచేయనున్నాయి.

స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు మూడు శాతం రిజర్వేషన్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరేందుకు దరఖాస్తు చేయవచ్చు. ప్రభుత్వ శాఖలు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో క్రీడాకారులకు మూడు శాతం రిజర్వేషన్‌లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వం గుర్తించిన క్రీడల్లో సీనియర్ విభాగంలో ప్రతిభ చూపిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులు. అర్హత కలిగిన వారు తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ వెబ్‌సైట్ www.sdat.tn.gov.in లో సోమవారం నుంచి సెప్టెంబరు 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

29 నుంచి విద్యాసంస్థల్లో క్రీడా పోటీలు

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో క్రీడా పోటీలు నిర్వహించాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సూచించింది. ఈ నెల 29వ తేదీ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు 'మేజర్ ధ్యాన్‌చంద్ కప్' పేరుతో విద్యా సంస్థల్లో క్రీడా పోటీలు, క్రీడలకు సంబంధించిన చర్చా గోష్ఠి, సైక్లింగ్, మారథాన్ తదితరాలు నిర్వహించాలని, విజేతలకు బహుమతి ప్రదానం చేయాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

డ్రోన్ ఆపరేటింగ్‌పై మూడు రోజుల శిక్షణ

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నగరంలో సెప్టెంబరు 9 నుంచి 11వ తేదీ వరకు డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. డ్రోన్ రకాలు, నిర్వహణ పద్ధతులు, అత్యవసర కిట్లు, అసెంబ్లింగ్ సహా పలు అంశాలపై నిపుణులు వివరించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు నిండిన వారు శిక్షణలో పాల్గొనవచ్చు. శిక్షణా కాలంలో తక్కువ ధరకు పురుషులు, మహిళలకు వేర్వేరుగా బస కల్పించనున్నారు. వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, 9543773337, 9360221280 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

మదురై-దుబాయ్ విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మదురై నుంచి దుబాయ్ వెళ్లే స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. విమానం బయల్దేరేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో తలెత్తిన సాంకేతికలోపాన్ని గుర్తించిన పైలెట్, విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారుల అనుమతితో రన్‌వే పక్కన విమానాన్ని ఆపి, సాంకేతిక నిపుణులు లోపం సరిచేసేందుకు ఉపక్రమించారు. ఈ కారణంగా మధ్యాహ్నం 12.20 గంటలకు బయల్దేరాల్సిన విమానం ఆలస్యంగా బయల్దేరుతుందని అధికారులు ప్రకటించారు.

29 వరకు ఎండ తీవ్రత

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 29వ తేదీ వరకు ఎండ తీవ్రత సాధారణం కన్నా మూడు డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో మంగళవారం నుంచి 29వ తేదీ వరకు ఎండలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరుగనున్నాయి. రాజధాని నగరం చెన్నై, శివారు ప్రాంతాల్లో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ అత్యధిక ఉష్ణోగ్రత 37 డిగ్రీల వరకు పెరగనుంది. అదే సమయంలో పశ్చిమ దిశ గాలుల వేగంలో మార్పుల కారణంగా ఈ నెల 30వ తేదీ వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వృత్తి శిక్షణలో చేరేందుకు ఈ నెల 31వ తేదీలోగా విద్యార్థులు దరఖాస్తు చేయాలని చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. చెన్నై కార్పొరేషన్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్‌తో ఉచిత వృత్తి శిక్షణ ఇస్తోంది. 14 నుంచి 40 ఏళ్లలోపున్న వారు ఈ శిక్షణలో చేరవచ్చు. మహిళలకు వయోఃపరిమితి లేదు. చదువుతున్న సమయంలోనే కర్మాగారాల్లో రూ.5,000 నుంచి రూ.10,500 వేతనంతో కూడిన శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణా కాలంలో ప్రతినెలా రూ.750 ఉపకారవేతనం, 'పుదుమై పెన్' పథకంలో రూ.1,000 అందజేయనున్నారు. కంప్యూటర్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్ తదితర కోర్సులకు 10వ తరగతి ఉత్తీర్ణత, ప్లంబర్ కోర్సుకు 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన వారు https://chennaicorporation.gov.in/gcc/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని, సర్టిఫికెట్లతో చెన్నై కార్పొరేషన్ వృత్తి శిక్షణా కేంద్రంలో ఈ నెల 31వ తేదీలోపు సమర్పించాలని చెన్నై కార్పొరేషన్ తెలియజేసింది.

పట్టాలపై స్కూల్ వ్యాన్ బోల్తా

- రైలు రాకపోవడంతో తప్పిన పెనుప్రమాదం
- ఎనిమిది మంది విద్యార్థులకు గాయాలు

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైలుపట్టాలపై వ్యాన్ బోల్తాపడగా, ఆ సమయంలో రైలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కడలూరు జిల్లా విరుదాచలం సమీపం పూవనూరు రైలు పట్టాలను సోమవారం ఉదయం దాటేందుకు యత్నించిన ప్రైవేటు పాఠశాల వ్యాన్ అదుపుతప్పి పట్టాలపై ఒరిగి పడింది. వ్యాన్‌లోని విద్యార్థుల కేకలతో పూవనూరు గ్రామస్తులు అక్కడకు చేరుకుని వ్యాన్ నుంచి విద్యార్థులను రక్షించారు. ఈ ఘటనలో 8 మంది విద్యార్థులకు గాయాలుకాగా, వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, గత నెల కడలూరులో రైలుపట్టాలు దాటేందుకు యత్నించిన పాఠశాల వ్యాన్‌ను రైలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే.



వ్యాన్ నుంచి విద్యార్థులను రక్షిస్తున్న గ్రామస్తులు

డ్రైవర్ అజాగ్రత్తే ప్రమాదానికి కారణం...

డ్రైవర్ అజాగ్రత్తే ప్రమాదానికి కారణమని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ సమయంలో రైళ్ల రాకపోకలు లేకపోవడంతో, వాహనాలు వెళ్లేందుకు గేట్లు తీసినట్లు తెలిపింది. ఈ రైల్వే గేటు ఇంటర్‌లాక్ సదుపాయం ఉందన్నారు. ఈ ఘటనకు కారణమైన డ్రైవర్ శేఖర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారని, గాయపడిన విద్యార్థులకు చికిత్స అందిస్తున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ఆన్‌లైన్ వ్యాపారాలను నిషేధించాలి

- వ్యాపారుల సంఘ పేరవై అధ్యక్షుడు విక్రమరాజా

వేలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆన్‌లైన్ వ్యాపారాలపై నిషేధం విధించాలని వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏఎం విక్రమరాజా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షులు జ్ఞానవేలు, వేలూరు మండల అధ్యక్షుడిగా పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం తొరప్పాడిలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న విక్రమరాజా మీడియాతో మాట్లాడుతూ... వ్యాపారులకు రక్షణ, భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 30న తిరుచ్చిలో ఆందోళన చేపట్టనున్నామన్నారు. విదేశీ సంస్థలు, ఆన్‌లైన్ వ్యాపారంతో నష్టపోతున్న రాష్ట్ర వ్యాపారులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన పన్ను కారణంగా రాష్ట్రంలో వ్యాపార రంగం దెబ్బతినిందన్నారు. అందుకు ప్రతిగా అమెరికా వస్తువులను బహిష్కరించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపు ఇస్తున్నట్లు విక్రమరాజా తెలిపారు.

2019 నుంచి ఎన్నికల్లో పోటీచేయని పార్టీలకు నోటీసులు

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధుల చట్టం 1951వ సెక్షన్ 29వ విభాగం ప్రకారం ఎన్నికల కమిషన్‌లో నమోదుచేసుకున్న పార్టీలు పలు రాయితీలు పొందుతుంటాయి. ఆదాయపు పన్ను మినహాయింపు, ఎన్నికల సమయంలో చిహ్నాల కేటాయింపులో ప్రాధాన్యత, ప్రముఖ నేతల ప్రచారంలో రాయితీ తదితరాలు అందిస్తుంటారు. ఆ ప్రకారం, కమిషన్‌లో నమోదు చేసుకున్న పార్టీలు ఎన్నికల్లో పోటీచేయాల్సి ఉంది. కానీ, కొన్ని పార్టీలు ఎన్నికల్లో పోటీచేయకుండా రాయితీలు మాత్రం పొందుతున్నాయనే ఫిర్యాదులున్నాయి. ఆ ప్రకారం, 2019 నుంచి ఆరేళ్లుగా ఎలాంటి ఎన్నికల్లో పోటీచేయని పార్టీలపై విచారణ జరిపాలని కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, చెన్నై జిల్లాలో ఆరు పార్టీలకు ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులిచ్చింది. తేనాంపేట కేంద్రంగా పనిచేస్తున్న గోకుల మక్కల్ కట్చి, కోడంబాక్కంలోని ఇండియన్ లవర్స్ పార్టీ, టి.నగర్‌లోని ఇండియన్ మక్కల్ కల్వి మున్నేట్ర కళగం, నుంగంబాక్కం లోని మక్కల్ దేశీయ కట్చి, దక్షిణ మరక్కాయర్ వీధిలో ఉన్న మనిదనేయ మక్కల్ కట్చి, అశోక్‌నగర్‌లో ఉన్న పెరుంతలైవర్ మక్కల్ కట్చి తదితర ఆరు పార్టీలు మంగళవారం హాజరై సంజాయిషీ ఇవ్వాలని ఎన్నికల సంఘం నోటీసు జారీచేసింది.

వినాయకుడి విగ్రహాల స్వాధీనం

పారీస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై ప్రాంతంలోని శిల్పాల తయారీ కేంద్రంలో సోమవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన రెవెన్యూ అధికారులు పది వినాయక విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. వినాయక చవితి సందర్భంగా రాష్ట్రంలో పర్యావరణానికి హానికలగకుండా మట్టి, పండ్లు, కూరగాయలు తదితరాలతో తయారుచేసిన విగ్రహాలనే వాడాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సూచించింది. ఈ నేపథ్యంలో, జిల్లా కేంద్రం మైలాడుదురై ముంగిళ్ గార్డెన్ ప్రాంతంలోని శిల్పాల తయారీ కేంద్రంలో వినాయక చవితి వేడుకల కోసం పీఓపీతో విగ్రహాలు తయారు చేస్తున్నట్లు రెవెన్యూశాఖ అధికారులకు సమాచారం తెలిసింది. సోమవారం ఉదయం ఆ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అధికారులు పది వినాయక విగ్రహాలను స్వాధీనం చేసుకుని ఆ కేంద్రానికి తాళంవేసి సీలు వేశారు. దీంతో ఆగ్రహించి హిందూ సంఘాల నిర్వాహకులు ఆందోళనకు దిగారు. హిందూ సంస్థల నిర్వాహకులు మాట్లాడుతూ, వినాయక చవితి కోసం తాము పోలీసుల నుండి ముందుగానే అనుమతి పొందిన ప్రాంతాల్లో గణేష్ విగ్రహాల ప్రతిష్ట కోసం ఆర్డర్ చేసిన విగ్రహాల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ రసాయనం కలిపారని విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారని, పండుగకు ఒక్క రోజే సమయం ఉన్నందువల్ల ఆ విగ్రహాలను పరిశీలించి తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు.



స్వాధీనం చేసుకున్న విగ్రహాల ముందు నిరసన తెలుపుతున్న హిందూ సంస్థల నిర్వాహకులు

కిడ్నీ విక్రయంపై కేసు నమోదు చేయాలి

- హైకోర్టు మదురై బెంచ్

పారీస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కిడ్నీ విక్రయించిన వ్యవహారాల్లో కేసు నమోదు చేసి నివేదిక దాఖలు చేయాల్సిందిగా పోలీస్‌శాఖకు మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఆదేశించింది. పరంకుడికి చెందిన సత్తీశ్వరన్ మదురై హైకోర్టు బెంచ్‌లో దాఖలు చేసిన ప్రజావాజ్యంలో, నామక్కల్ జిల్లాలో చట్టవిరుద్ధంగా కిడ్నీలు విక్రయించి మోసం చేసిన విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. పల్లిపాళయంలోని నేత కార్మికుల పేదరికాన్ని ఆసరాగా తీసుకున్న కొంతమంది దళారులు, వైద్యులు కిడ్నీల దానం పేరుతో మోసానికి పాల్పడుతున్నారని, ఒక్కొక్క కిడ్నీని రూ.5 నుండి రూ.10 లక్షల వరకు విక్రయించి దాతలకు తక్కువ నష్టపరిహారం అందజేశారని పిటిషన్‌లో సూచించారు. ఈ వ్యవహారంలో ప్రధాన రాజకీయ పార్టీకి సంబధాలున్నందున ఈ కేసు విచారణను సీబీఐకి బదిలీ చేయాలని పిటిషన్‌లో కోరారు. సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఎం.సుబ్రమణ్యం, జస్టిస్ అరుళ్‌మురుగన్‌లతో కూడిన బెంచ్ ముందు విచారణకు వచ్చింది. అప్పుడు ప్రభుత్వం తరుపున హాజరైన న్యాయవాదులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. అనంతరం కిడ్నీ విక్రయ వ్యవహారంపై ఇప్పటి వరకు క్రిమినల్ కేసు ఎందుకు నమోదు చేయాలని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఇలాంటి కేసులకు సంబంధించి ఫిర్యాదులు వస్తేనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చట్టంలో ఉందని ప్రభుత్వం తరుపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇందుకు న్యాయమూర్తుల ధర్మాసనం, ఈ కేసులో అభాగ్యులు నష్టపోయారని, వాస్తవం తెలిసిన తర్వాత కూడా కేసు నమోదు చేయకపోవడం చట్టవిరుద్ధమని, అందువల్ల పల్లిపాళయం కిడ్నీ విక్రయ వ్యవహారంపై తక్షణమే కేసు నమోదు చేయాలని ఉత్తర్వులు జారీచేశారు. అంతేకాకుండా ఐపీఎస్ అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు కమిటీని ఏర్పాటుచేయడంపై డీజీపీతో చర్చించి న్యాయస్థానానికి తెలియజేయాలని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

వాట్సాప్‌లో జీసీసీ సేవలు

- ప్రారంభించిన మేయర్ ప్రియ

పారీస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) అందిస్తున్న సేవలు ప్రజలు సులువుగా తెలుసుకునేలా వాట్సాప్ సేవలను సోమవారం మేయర్ ఆర్.ప్రియ ప్రారంభించారు. జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ బిల్డింగ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ జె.కుమరగురుపరన్, డిప్యూటీ కమిషనర్లు శివకృష్ణమూర్తి, పృథ్విరాజ్, రెవెన్యూ అధికారి భానుచంద్రన్, స్టాండింగ్ కమిటీ చైర్మెన్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. కాగా, జీసీసీ సేవలను 'నమ్మ చెన్నై' యాప్, ఇంటర్‌నెట్, 1913 కాల్ సెంటర్ల ద్వారా ప్రజల సెల్‌ఫోన్లకు సమాచారం పంపించవచ్చు. నూతనంగా రూపొందించిన ఈ వాట్సాప్ సేవలు తమిళం, ఆంగ్ల భాషల్లో తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించారు. నగరవాసులు 9445061913 అనే నెంబర్‌ను తమ సెల్‌ఫోన్‌లో నమోదు చేసి 'హాయ్' అని మెసేజ్ పంపడం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. ఈ సేవల ద్వారా బర్త్, డెత్ సర్టిఫికెట్లు, ఆస్తి, వృత్తి పన్ను, దుకాణాల అద్దె, వ్యాపారానికి సంబంధించిన లైసెన్స్ రెనువల్, కమ్యూనిటీ హాలు, ఈత కొలనులు ముందుగానే బుక్ చేసుకోవడం తదితర సేవలను 24 గంటలు పొందవచ్చు. అంతేకాకుండా జీసీసీ జోన్లు, వార్డులు, అమ్మా క్యాంటీన్, బస్‌స్టాండ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పని తీరు కూడా తెలుసుకోవచ్చు. తదుపరి విడతగా చెన్నై మెట్రో వాటర్ బోర్డు, రిజిస్ట్రేషన్ శాఖలను కూడా ఈ వాట్సాప్‌కు విలీనం చేయనున్నట్లు జీసీసీ అధికారులు తెలిపారు.



వాట్సాప్ సేవలను ప్రారంభిస్తున్న మేయర్

టాన్‌జెట్కోకు హైకోర్టు నోటీసులు

- తడిలేని బూడిద కేసు...



జల విద్యుత్ కేంద్రం

పారీస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తడిలేని బూడిద కేటాయింపు కేసు విచారణకు హాజరుకావాలని టాన్‌జెట్కో డైరెక్టర్‌కు మద్రాస్ హైకోర్టు సోమవారం ఉదయం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని జల విద్యుత్ కేంద్రంలో తడిలేని బూడిద కేటాయింపులో అవకతవకలున్నాయంటూ సేలంకు చెందిన చిన్న పరిశ్రమల సంఘం నాయకుడు సంతోష్ మద్రాస్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం మంగళవారం కోర్టులో హాజరు కావాల్సిందిగా టాన్‌జెట్కో డైరెక్టర్‌కు నోటీసులు జారీచేసింది. ఒకవేళ హాజరుకాకుంటే కేసును సీబీఐకి మళ్లించాల్సివుంటుందని హైకోర్టు హెచ్చరించింది.

- జెండా స్తంభాల తొలగింపు...

హైకోర్టు ఉత్తర్వులపె సుప్రీంకోర్టు స్టే

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జెండా స్తంభాలు తొలగించాలన్న హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. సీపీఎం దాఖలుచేసిన అప్పీలు పిటిషన్ సోమవారం విచారించిన సుప్రీంకోర్టు స్టే విధించడంతో పాటు ఈ వ్యవహారంలో అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు పక్కన ఉన్న జెండా స్తంభాలు తొలగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.

మెట్రో ఛార్జీల పెంపు లేదు

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో మెట్రో రైలు ఛార్జీల పెంపు సోమవారం నుంచి అమలుకు వచ్చిన నేపథ్యంలో, చెన్నైలో ఛార్జీలు పెంపు అంశం పరిశీలనలో లేదని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) స్పష్టం చేసింది. అదే సమయంలో, మెట్రో రైలు ఛార్జీల పెంపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని సీఎంఆర్ఎల్ తెలిపింది. కాగా, ఢిల్లీలో 8 ఏళ్ల అనంతరం మెట్రో రైలు ఛార్జీలు పెరిగాయి.

ట్రాఫిక్ ఎస్ఐ ఆత్మహత్య

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తండయార్‌పేటలో ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తున్న శివకుమార్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. శివకుమార్‌కు థెరిసా అనే భార్య, గోపికా అనే కుమార్తె, మోనీస్ అనే కుమారుడు ఉన్నారు. సోమవారం ఉదయం ఇంటిలోని వారంతా బయటికి వెళ్లగా ఆయన తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. భార్యాపిల్లలు తిరిగొచ్చి చూడగా ఆయన ఉరివేసుకుని ఉండడంతో దిగ్భ్రాంతి చెందారు. ఈ సంఘటన పై తండయార్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరిపారు. పోలీసుల ప్రాథమిక విచారణలో శివకుమార్‌కు మద్యం అలవాటు ఉండేదని, ఈ విషయమై భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండేవారని, ఆ నేపథ్యంలోనే ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని వెల్లడైంది. శివకుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షురాలిగా మృదుల




అధ్యక్షురాలు మృదుల, కార్యదర్శి షంషీర్ అహ్మద్

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర విభాగం అధ్యక్షురాలిగా మృదుల ఎంపికయ్యారు. ఆ సమాఖ్య రాష్ట్ర విభాగం 27వ మహానాడు తిరుప్పూరు జిల్లా చెంగపల్లిలో మూడు రోజుల పాటు జరిగాయి. తొలి రోజు ర్యాలీలో సమాఖ్య అఖిల భారత అధ్యక్షులు ఆదర్శ్ ఎం. షాజీ, ఉపాధ్యక్షురాలు మృదుల, రాష్ట్ర విభాగం అధ్యక్షుడు షంషీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. రెండో రోజు నిర్వహించిన సభలో సమాఖ్య అఖిల భారత ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్యా ప్రసంగించారు. మహానాడు మూడో రోజు సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ ఎంపిక జరిగింది. సమాఖ్య రాష్ట్ర విభాగం అధ్యక్షురాలిగా సి.మృదుల, కార్యదర్శిగా షంషీర్ అహమ్మద్ ఎంపికయ్యారు. వీరితో పాటు డిప్యూటీ కార్యదర్శులు తదితరులు ఎంపికయ్యారు.

ప్రేమ వివాహాలకు మా పార్టీ ఆఫీసులు రెడీ!

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం



పారీస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఎం కార్యాలయాన్ని కులాంతర వివాహాలు చేసుకునే ప్రేమికులకు కళ్యాణవేదికగా ఉపయోగించుకునేందుకు అనుమతిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పి.షణ్ముగం తెలిపారు. సోమవారం ఆయన తన ఎక్స్‌పేజీలో ఈ విషయం పోస్ట్‌చేశారు. రాష్ట్రంలో కులాంతర వివాహాలు చేసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక వసతులు కల్పించలేదని, వేర్వేరు కులాలకు చెందిన యువతీ,యువకులు ప్రేమ వివాహం చేసుకోవడాన్ని తమ పార్టీ ప్రోత్సహిస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీపీఎం కార్యాలయాల్లో కులాంతర వివాహాలు జరుపుకోవచ్చని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం పరువు హత్యల నివారణ చట్టాన్ని తీసుకురావాలని షణ్ముగం డిమాండ్ చేశారు.

నల్లకన్నుకు విజయ్ పరామర్శ

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నేత నల్లకన్ను ఆరోగ్య పరిస్థితిని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, నటుడు విజయ్ విచారించారు. ఈ నెల 22న తన ఇంట్లో కిందపడిన నల్లకన్ను తలకు గాయకావడంతో నందనంలోని వెంకటేశ్వర ఆస్పత్రిలో చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని ఆస్పత్రి ఆదివారం ప్రకటన విడుదల చేశాయి. ఈ క్రమంలో, ఆదివారం రాత్రి నల్లకన్నును మెరుగైన చికిత్స కోసం రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. నల్లకన్ను త్వరగా కోలుకోవాలని పలు పార్టీల నేతలు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో, టీవీకే అధ్యక్షులు విజయ్ సోమవారం నల్లకనున్న మనవడికి ఫోన్ చేసి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

నిండిన వీరాణం చెరువు



చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా వీరాణం చెరువు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవటంతో అదనపు జలాలలను దిగువకు విడుదల చేస్తున్నారు. సేత్తియాతోప్పు పూదకుడి నుండి కాట్టుమన్నార్‌కోవిల్ వరకు 14 కి.మీ. పొడవున ఉన్న వీరాణం చెరువులో 47.50 అడుగుల వరకు నీటిని నిల్వ చేసే వీలుంది. వీరాణం చెరువు నుంచి సుమారు 55 వేల ఎకరాలకు సాగు నీరు విడుదల చేస్తుంటారు. చెన్నై మెట్రోవాటర్ బోర్డు చెన్నై నగరవాసుల తాగునీటి కోసం సరఫరా చేస్తోంది. ప్రస్తుతం సేలం జిల్లా మేట్టూరు డ్యామ్ నుండి విడుదలవుతున్న అదనపు నీరంతా వీరాణం చెరువలోకి ప్రవేశించడంతో నీటిమట్టం విపరీతంగా పెరుగసాగింది. సోమవారం ఉదయం 46 అడుగుల మేర నీటిమట్టం పెరగటంతో ఆ చెరువు నుండి సెకనుకు 5683 ఘనపుటడుగుల జలాలను విడుదల చేస్తున్నారు.

రైలు పట్టాలపై రాళ్లు

- ఆవారంపాళ్యంలో పోలీసుల విచారణ



పారీస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోవై జిల్లా ఆవారంపాళ్యం లో రైలును కూల్చివేయాలనే సంఘ విద్రోహులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. వివరాల్లోకి వెళితే త్రివేండ్రం-చెన్నై ఎక్స్‌ప్రెస్ కోవై జిల్లాలోని ఆవారంపాళ్యం దాటిన సమయంలో పట్టాలపై సిమెంటు రాళ్లు పెట్టిన విషయం తెలిసింది. రైలు చక్రాలు ఎక్కడంతో సిమెంట్ రాళ్లు ముక్కలయ్యాయి. అయితే రైలుకు ఎలాంటి నష్టం జరగలేదు. సమాచారం తెలిసి సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే అధికారులు, ఆర్పీఎఫ్ బలగాలు రైలు పట్టాలపై సిమెంట్ రాళ్లను పెట్టింది ఎవరు? ఒకవేళ రైలును కూల్చడానికి చేసిన కుట్రా? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

సబర్బన్ రైళ్ల సేవలకు అంతరాయం

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై బీచ్-తాంబరం మధ్య సబర్బన్ రైలు సేవలకు అంతరాయం కలుగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కోడంబాక్కం నుంచి సెయింట్ థామస్ మౌంట్ వరకు రైలు పట్టాల సమీపంలో చెట్లను తొలగిస్తున్నారు. ఆ సమయంలో, సోమవారం ఉదయం ఓ చెట్టు విద్యుత్ స్తంభంపై పడడంతో మంటలు చెలరేగాయి. దీంతో, చెన్నై బీచ్-తాంబరం మార్గంలో వెళ్తున్న సబర్బన్ రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రైళ్ల రాకపోకల పునరుద్ధరణకు అరగంట పడుతుందని రైల్వే అధికారులు తెలిపినా, గంట గడిచినా రైళ్లే బయల్దేరకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అలాగే, రైళ్లలో వెళ్లేందుకు వేచి ఉన్న ప్రయాణికులతో మాంబళం, సైదాపేట, గిండి రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. కాగా, ప్రయాణికుల భద్రత దృష్ట్యా చెట్లు తొలగింపు పనులు చేపట్టామని, అదే సమయంలో ప్రయాణికుల ఇబ్బందులు కూడా గమనించామని దక్షిణ రైల్వే సంజాయిషీ తెలిపింది.

శ్రీలంక వెళ్లిన రామేశ్వరం జాలర్లు



జాలర్ల మరబోటు

పారీస్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక న్యాయస్థానం విడిపించిన పడవలను స్వాధీనం చేసుకునేందుకు రామనాథపురం జిల్లా రామేశ్వరం జాలర్లు సోమవారం ఉదయం మరబోటులో శ్రీలంక వెళ్లారు. సముద్ర సరిహద్దులు దాటి చేపలవేటకు వచ్చారనే కారణంతో 2021-2022వ సంవత్సరాల్లో శ్రీలంక నావికాదళ సిబ్బంది రామేశ్వరం జాలర్ల పడవలను స్వాధీనం చేసుకున్నారు. ఈ పడవలను విడిపించాలని కోరుతూ వాటి యజమానుల తరుపున శ్రీలంక న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలైయ్యాయి. వాటిని పరిశీలించిన న్యాయస్థానం 12 పడవలను విడుదల చేయాలని ఉత్తర్వులు జారీచేసింది దీంతో లంక మైలిట్టి ఫిషింగ్ హార్బర్‌లోవున్న ఆ పడవలను తీసుకు వచ్చేందుకు రామేశ్వరం జాలర్లు మరబోటులో శ్రీలంక బయలుదేరివెళ్లారు.

ఊరీసు కళాశాలలో కంబన్ వేడుకలు



వేలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఊరీసు కళాశాల ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం వేలూరు కంబన్ కళగం, ఊరీసు కళాశాల తమిళ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కవి చక్రవర్తి కంబన్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలను కంబన్ కళగ అధ్యక్షులు జీవీ సెల్వం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు జీవీ సెల్వం బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని ఊరీసు కళాశాల తమిళ శాఖ అధ్యక్షులు రాజ్‌కుమార్, రచయిత భారతి కృష్ణకుమార్ పర్యవేక్షించారు.

ఘనంగా కృపానంద వారియార్ జయంతి



కృపానంద వారియార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమురుగ కృపానంద వారియార్ జయంతి సందర్భంగా కాట్పాడి డివిజన్ గాంగేయనల్లూర్‌లోని ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షులు బాబు, కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మణన్, 1వ మండల కమిటీ అధ్యక్షులు పుష్పలత, పీఆర్వో శాఖ అధికారి కదిరవన్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సంక్షేమ సహాయాలు



వేలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 165 మంది పారిశుధ్య కార్మికులకు రూ.8.65 లక్షల విలువైన సంక్షేమ సహాయాలను కలెక్టర్ సుబ్బులక్ష్మి అందజేశారు. తమిళనాడు పారిశుధ్య కార్మిక సంక్షేమ శాఖ అధ్యక్షులు తిప్పంపట్టి ఆరుస్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సంక్షేమ శాఖ సభ్యుడు జి.రాజన్, కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మణన్, మున్సిపాలిటీల మండల డైరెక్టర్ నారాయణన్, జిల్లా ఆదిద్రావిడులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి మధుచెలియన్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంచిని స్వీకరించడమే పని

● శివకార్తికేయన్



ప్రస్తుతం సమాజంలో మంచిని స్వీకరించి ముందుకు సాగిపోవడమే తన పని అని హీరో శివకార్తికేయన్ అన్నారు. ఆయన నటించిన 'మదరాసి' చిత్రాన్ని వచ్చే నెల 5వ తేదీ విడుదలచేయనున్నారు. దీన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నగరంలో చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరో శివకార్తికేయన్ మాట్లాడుతూ, 'ఒక చిత్రం బాగుందంటే ఆ చిత్ర బృందాన్ని ఆహ్వానించి అభినందిస్తున్నాను. దీన్ని అనేక మంది తప్పుగా భావిస్తున్నారు. శివకార్తికేయన్ అంత పెద్దోడా అంటూ ప్రశ్నిస్తున్నారు. మంచి చేసేందుకు ఎందుకు ఆలోచించాలి. జీవితంలో విమర్శలు కూడా ఒక భాగమే. అనేక రికార్డులు నెలకొల్పిన సచిన్ టెండూల్కర్ కూడా విమర్శలు ఎదుర్కొన్నారు. చెన్నై సూపర్ కింగ్స్ కోసం 5 సార్లు కప్ గెలిచిన కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కూడా విమర్శలకు గురయ్యారు. ఇలా సమాజంలో మంచిని మాత్రమే స్వీకరించి ముందుకు సాగిపోవడమే నా పని' అని శివకార్తికేయన్ స్పష్టం చేశారు. కాగా ఏఆర్.మురుగదాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించగా శ్రీ లక్ష్మి మూవీస్ మేకర్స్ దీనిని రూపొందించింది.

చిత్రజ్యోతి

కల్తీ సారా మృతులకు రూ.10 లక్షల పరిహారమా? : సీమాన్

కల్తీ సారా తాగి చనిపోయే వారికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ఇస్తుందని, కానీ దేశ రక్షణలో భాగంగా సరిహద్దుల్లో శత్రువులతో పోరాడి ప్రాణత్యాగం చేసే సైనికులకు మాత్రం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నయాపైసా ఇవ్వడం లేదని నామ్ తమిళర్ కట్చి కన్వీనర్, సినీ నటుడు సీమాన్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో జరిగిన 'ఆట్టి' మూవీ ఆడియో, ట్రైలర్ రిలీజ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 'మన సంప్రదాయంలో మహిళలకు ప్రాధాన్యత ఎక్కువ. వేలు నాచ్చియార్‌కు శివగంగలో చిన్న విగ్రహం ఉంది. చరిత్రలో ఆమెను పూర్తిగా విస్మరించారు. స్త్రీలను గౌరవించని ఏ సమాజం కూడా వృద్ధిలోకి రాలేదు. మన చరిత్రను మనమే సృష్టించుకోవాలి. ఈ చిత్ర దర్శకుడు కిట్టు అలాంటి చిన్న ప్రయత్నం చేశారని భావిస్తున్నాను. ఇదిలావుండగా లక్ష్మి క్రియేషన్స్ పతాకంపై శక్తి కార్వణ్ణన్ నిర్మాణంలో రూపొందిన చిత్రం 'ఆట్టి'. ఇందులో హీరోగా శక్తి కార్వణ్ణన్ పోలీస్ అధికారి పాత్ర పోషించారు. అభి హీరోయిన్‌గా కాదల్ సుకుమార్, సౌందర్, ప్రవీణ్ పళనిస్వామి తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. చిత్ర బృందం సభ్యులతో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు.



'ఆట్టి' ఆడియో రిలీజ్ దృశ్యం

షూటింగ్ హాల్ ప్రారంభించిన సీఎం



షూటింగ్ హాల్ ప్రారంభోత్సవ దృశ్యం

తరమణిలోని డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వం ఫిల్మ్ సిటీలో రూ.5.10 కోట్లతో ఆధునికీకరించిన సినీ షూటింగ్ హాల్‌ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఒకప్పుడు ఎన్నో చిత్రాల నిర్మాణాలకు కేంద్రంగా ఉన్న ఈ ఫిల్మ్ సిటీలో సౌకర్యాల లేమి కారణంగా పెద్దగా సినిమాల షూటింగులు జరగడం లేదు. దీంతో ఈ ఫిల్మ్ సిటీని అభివృద్ధి చేసి సినిమా షూటింగులు జరిగేలా చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి స్టాలిన్ గతంలో ప్రకటించారు. ఆ ప్రకారంగానే తొలుత రూ.5.10 కోట్లను కేటాయించి, కొన్ని ముఖ్యమైన పనులను పూర్తి చేశారు. పూర్తి ఏసీతో కూడిన షూటింగ్ హాల్ ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి స్వామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, తమిళ భాషాభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి రాజారామన్, డీఐపీఆర్ డైరెక్టర్ వైద్యనాథన్, తమిళనాడు ప్రభుత్వం డాక్టర్ ఎంజీఆర్ ఫిల్మ్, టీవీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ మరుదు, ఫిల్మ్ సిటీ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ మేఘవర్ణం తదితరులు పాల్గొన్నారు.

తండ్రి దర్శకుడు.. తనయుడు సంగీత దర్శకుడు

● 12న 'అంద 7 నాడ్గల్' మూవీ రిలీజ్



నిర్మాత మురళీ కబీర్‌దాస్, దర్శకుడు సుందర్

తమిళ చిత్రపరిశ్రమలో ఒక చిత్రానికి తండ్రి దర్శకత్వం వహిస్తే అదే చిత్రానికి తనయుడు స్వరాలను సమకూర్చారు. బెస్ట్‌కాస్ట్ నిర్మాణ సంస్థ తెరకెక్కించిన 'అంద 7 నాడ్గల్' అనే చిత్రానికి తండ్రీ కొడుకులు కలిసి పనిచేశారు. 12వ తేదీ విడుదలకానున్న ఈ చిత్రంలో అజితేజ్, శ్రీ శ్వేత హీరోహీరోయిన్లుగా నటించారు. ఇతర పాత్రల్లో నటుడు కె.భాగ్యరాజ్, నమో నారాయణన్, సుభాషిణి కన్నన్, తలైవాసల్ విజయ్ పోషించారు. లవ్, థ్రిల్లర్ మూవీగా రూపొందించిన ఈ చిత్రానికి సంగీతం సచిన్ సుందర్. దర్శకత్వం సుందర్. నిర్మాత మురళి కబీర్‌దాస్. ఈ చిత్రం వివరాలను సోమవారం దర్శక నిర్మాతలు సంయుక్తంగా మీడియాకు వివరించారు. చెన్నై, కోడైక్కెనాల్‌లో 45 రోజుల చిత్రీకరణ పనులు పూర్తి చేశాం. తమిళ చిత్రపరిశ్రమలోనే ఒక చిత్రానికి తండ్రీతనయులు కలిసి, దర్శకత్వం, సంగీతం సమకూర్చడం ఇదే తొలిసారి కావొచ్చు. ఇది పూర్తి ప్రేమ కథా చిత్రం. ఈ సినిమాలో హీరో పాత్ర కోసం అనేక మందిని పరీక్షించి, ఇన్‌స్టాలో మంచి పాపులర్ అయిన అజితేజ్ అనే తెలుగు కుర్రోడిని హీరోగా ఎంపిక చేసాం. అలాగే, హీరోయిన్‌గా కోయంబత్తూరుకు చెందిన శ్రీ శ్వేతను ఎంపిక చేశాం. ఈ సినిమా కోసం పనిచేసిన వారిలో అనేక మందికి తొలి సినిమా ఇది. ఇందులో భాగ్యరాజ్ మంత్రి పాత్ర పోషించారు. హీరో విషయంలో నెగెటివ్ సంఘటన జరుగుతుంది. దాని నుంచి పాజిటివ్‌గా ఎలా బయటపడ్డారన్నదే ఈ చిత్ర కథ. ప్రతి ఒక్కరికీ నచ్చేలా స్టోరీ సాగుతుంది' అని పేర్కొన్నారు.

'ఫాబ్ స్టార్స్ ఐకానిక్-2025' అవార్డుల ప్రదానం



అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో 'ఫాబ్ స్టార్స్ ఐకానిక్-2025' పంచమ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి నాలుగేళ్లుగా ఫైసాఖాన్, అబ్దుల్ సంయుక్తంగా 'ఫాబ్ స్టార్స్ ఐకానిక్' పేరుతో అవార్డులు అందజేస్తున్నారు. ఈ ఏడాది అవార్డు ప్రదానోత్సవం ఐటీసీ గ్రాండ్ చోళా స్టార్ హోటల్‌లో ఇటీవల జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ రంగానికి సంబంధించి డి.ఇమాన్, అభిరామి, యాషికా ఆనంద్, షీలా, ఉమా రియాజ్ ఖాన్, ఆర్కే సురేష్, నిత్యశ్రీ, వెట్రి వసంత్, పారిశ్రామిక రంగంలో కలాన్ షా కన్సల్టింగ్ సంస్థ యజమాని దేవానంద్ షా, 'నెక్సస్' పీఆర్ ప్రధాన నిర్వాహణ అధికారి ఇంద్రన్, విజయలక్ష్మి తదితరులకు అవార్డులు ప్రదానం చేశారు. ఆ కార్యక్రమంలో సినీ, పారిశ్రామిక రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం... గణనాథుడి విగ్రహం

● కర్ర పెండలం గుజ్జుతో వినాయకుడి ప్రతిమలు



వినాయకుడి ప్రతిమలకు రంగులు వేస్తున్న శిల్పి ముత్తురామలింగం

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా మానామదురై రామ్‌నగర్‌లో పర్యావరణానికి హాని కలగని విధంగా కర్ర పెండలం గుజ్జుతో అందమైన ప్రతిమలను తయారు చేస్తున్నారు. ప్రత్యేకించి ఆ ప్రాంతంలోని ఆలయాలకు విగ్రహాలను తయారు చేసే శిల్పి ముత్తురామలింగం కర్ర పెండలం దుంప గుజ్జుతో 5 నుండి పదడుగుల ఎత్తు వరకు అందమైన వినాయకుడి ప్రతిమలను రూపొందిస్తున్నారు. ఈ ప్రతిమలను ఆయన శివగంగ, రామనాథపురం జిల్లాల్లో ఆర్డర్ల మేరకు తయారు చేసి సరఫరా చేస్తున్నారు.

అరుణ్ నర్సింగ్ కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న జీవీ సంపత్

వేలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుణ్ నర్సింగ్, పారా మెడికల్ కళాశాల స్నాతకోత్సవం, కళాశాల వార్షికోత్సవం సోమవారం కోలాహలంగా సాగాయి. కార్యక్రమానికి కళాశాల అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ విజయ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా నరువి ఆస్పత్రి అధ్యక్షులు జీవీ సంపత్ హాజరై కోర్సు పూర్తిచేసిన 225 మంది విద్యార్థినీ, విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అరుణ్ ఆస్పత్రి డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్లు కీర్తి, వసంతకుమార్, అనిత, ట్రస్టీ జయంతి విజయ, కళాశాల ప్రిన్సిపాల్ కవిత, కలైసెల్వి, తిలకవతి, నిర్వాహ అధికారి సాగర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంచకర్మ ప్రొడక్షన్‌తో బీసీఏ ఒప్పందం



దర్శకుడు మన్‌ప్రీత్ సింగ్ దామితీ, సంస్కృత కళాశాల ట్రస్టీ రమేష్ మహాలింగం

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పంచకర్మ ప్రొడక్షన్స్ సంస్థతో భారతీయ సెంటర్ ఫార్ ఎక్స్‌లెన్స్ (బీసీఏ) సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందం ప్రకారం ఆ సంస్థ రూపొందించిన 'హిస్ స్టోరీ ఆఫ్ ఇతిహాస్' ఫీచర్ ఫిల్మ్‌ను విద్యా సంస్థల్లో ప్రదర్శించే బాధ్యతను బీసీఏ స్వీకరించనుంది. ఐఐటీ మద్రాసు, మైలాపూరు ఆర్ఆర్ సభ తదితర ప్రాంతాల్లో ప్రదర్శించనుంది. మద్రాసు సంస్కృత కళాశాల ట్రస్టీ రమేష్ మహాలింగం, హిస్ స్టోరీ ఆఫ్ ఇతిహాస్ దర్శకుడు మన్‌ప్రీత్ సింగ్ దామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయవంతంగా 'డిజైన్ థింకింగ్' సదస్సు



'డిజైన్ థింకింగ్' సదస్సులో పాల్గొన్న విద్యారంగ నిపుణులు

అడయార్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఎం ఐఎస్‌టీ) ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ డిజైన్ థింకింగ్ ఫ్యాకల్టీ రెండో స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తిచేసింది. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం ఐఎస్‌టీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సి.ముత్తమిళ్ సెల్వన్ మాట్లాడుతూ, 'ప్రభుత్వం, పరిశ్రమ, ఇతర సంస్థలతో ఎస్ఆర్ఎంఐఎస్‌టీ వ్యూహాత్మక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ ముందుకుసాగుతున్నట్టు వెల్లడించారు. ఎస్ఆర్ఎంఐఎస్‌టీలోని డీఈఐ డైరెక్టర్ డాక్టర్ శాంతను పాటిల్ మాట్లాడుతూ, 'బహుళ మార్గాల్లో కొత్త పరిష్కారాలను కనుగొనడానికి, సామాజిక సమస్యలను పరిష్కరించడానికి డిజైన్ థింకింగ్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.









ప్రధాన పీఠం - విద్యుద్దీపాల అలంకరణలో చర్చి భవనం - బంగారు కిరీటంతో బాలయేసు, ఆరోగ్యమాత

మహిమాన్వితం...

'బీసెంట్‌నగర్ వేలాంకన్ని' ఆలయం

● భక్తులను కరుణించే ఆరోగ్యమాత

భారతదేశంలోని అతిపెద్ద క్యాథలిక్ చర్చిల్లో చెన్నై బీసెంట్‌నగర్ వేలాంకన్ని ఆలయం ఒకటి. బంగాళాఖాతం తీరంలో ఎలియట్స్ బీచ్ ఒడ్డున వెలసిన ఈ మందిరం, స్వదేశీ, విదేశీ యాత్రికులకు స్వర్గధామం లాంటిది. ఈ ఆలయంలో కొలువుదీరిన వేలాంకన్ని అమ్మవారిని భక్తులు 'ఆరోగ్యమాత'గా ఆరాధిస్తున్నారు. కుల,మతాలకతీతంగా అందరూ ఈ ఆలయంలో మోకరిల్లి ప్రార్థనలు చేయడం విశేషం. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ చర్చి 53వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి.

వేలాంకన్ని మందిర చరిత్ర...

అన్నై 'వేలాంకన్ని'గా ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ మందిరాన్ని ప్రతిసంవత్సరం దాదాపు మిలియన్ ప్రజలు సందర్శిస్తుంటారని అంచనా. అదేవిధంగా ఆగస్టు-సెప్టెంబర్ నెలల్లో జరుపుకునే వార్షికోత్సవాల్లో దాదాపు 2లక్షల మంది భక్తులు హాజరవుతుంటారు. ఆలయ భవనం గోథిక్ నిర్మాణశైలి దర్పనమిస్తోంది. సముద్రతీరంలోని ఈ మందిరం ఉప్పుగాలికి దెబ్బతినకుండా ప్రతిసంవత్సరం మరమ్మతులు చేపడుతుంటారు. చర్చి ప్రాంగణంలోని 'మదర్ మేరీ' స్క్వేర్ దృశ్యపరంగా తల్లిమేరీకి సంబంధించిన నాలుగు దృశ్యాలను సూచిస్తుంది. ఈ నాలుగు 'మైలేడీ ఆఫ్ గ్వాదాలుపి (1531), 'మైలేడీ ఆఫ్ లా సాలెట్టి' (1846), మైలేడీ ఆఫ్ లూర్దు (1858), మైలేడీ ఆఫ్ ఫాతిమా' (1917). ఈ నాలుగింటిని ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్యాథలిక్ చర్చిల కేంద్రప్రాంతమైన రోమ్‌నగర్ ప్రధాన క్యాథలిక్ చర్చి అంగీకరించింది. 1971 వరకు బీసెంట్‌నగర్ చర్చి అడయార్‌లోని సెయింట్ లూయిస్ చర్చి నియంత్రణలో ఉండేది.

ఆకట్టుకుంటున్న మ్యూజియం..

చర్చి ప్రాంగణంలో సుమారు 30యేళ్ల క్రితం ప్రారంభించిన మ్యూజియంలో వేలాంకన్ని అమ్మవారి అద్భుతాలకు సంబంధించిన వివిధ కథలు అందుబాటులో ఉన్నాయి. అనారోగ్యంతో ఉన్నవారు ఇక్కడకు వచ్చి ప్రార్థనా రూపంలో విన్నవించుకుని కోలుకున్నట్లు వారు రాతపూర్వకంగా వేల సంఖ్యలో సమర్పించిన లేఖలు, మైనపుబొమ్మలు, బంగారం, వెండి, రాగితో తయారుచేసిన శరీర భాగాలు తదితర కృతజ్ఞతల ద్వారా కానుకలను ఇక్కడ ఉంచారు. ఈ నేపథ్యంలో, నాగపట్నం జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన వేలాంకన్ని బాసలిక లాగే, 1973లో బీసెంట్‌నగర్ వేలాంకన్ని చర్చిని కూడా పరిశుద్ధ స్థలంగా అధికారపూర్వకంగా ప్రకటించింది. ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు ఇక్కడికి పెద్దసంఖ్యలో వచ్చే భక్తులు కొవ్వొత్తులు వెలిగించి గులాబీలు సమర్పించి ఆరాధిస్తుంటారు. ఆలయ వెనుకభాగంలో ఉన్న మత్స్యకార గ్రామంలో కడలిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న దాదాపు 10వేలకు పైగా కుటుంబాల విజ్ఞప్తి మేరకు ఆ స్థలాన్ని చర్చి యాజమాన్యం వారికి ఉచితంగా అందజేయడం గమనార్హం.

ధ్వజస్తంభం...

ఈ నెల 29న పతాకావిష్కరణతో ప్రారంభమై సెప్టెంబర్ 8న పట్టాభిషేకం, పతాక అవనతం వరకు 10 రోజుల పాటు వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి ఏటా ఆలయ ప్రాంగణంలో 75 అడుగుల ధ్వజస్తంభంపై బాలయేసు, అమ్మవారి చిత్రపటాలతో రూపొందించిన 12 అడుగుల పొడవైన పతాకాన్ని ఆగస్టు 29న ఎగురవేసి ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల్లో సెప్టెంబర్ 7వ తేదీ నిర్వహించే రథోత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొనడం విశేషం. ఇక క్రిస్మస్, నూతన సంవత్సరం, గుడ్ ఫ్రైడే, ఈస్టర్, క్యాథలిక్ పండుగ రోజుల్లో ప్రత్యేక ప్రార్థనలకు కులమతాలకు అతీతంగా ప్రజలు హాజరవుతుంటారు.





నూతన మందిరం - బీసెంట్‌నగర్ వేలాంకన్ని చర్చి

ప్రార్థన వేళలు..


మందిరంలో ప్రతిరోజు ఉదయం 5.30 నుండి 6.30 గంటల వరకు, 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు తమిళం, ఆంగ్లంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) సంస్థ నగర, శివారు ప్రాంతాల నుండి బస్సులను బీసెంట్ నగర్ డిపో వరకు నడుపుతోంది. కాగా, పండుగ సీజన్‌లో మాత్రం అదనపు బస్సులు నడుపుతోంది. పర్యాటకులు, ప్రైవేటు సొంతవాహనాల్లో ఇక్కడి తరలివస్తుంటారు.


వార్షికోత్సవ దృశ్యం (ఫైల్‌ఫొటో)

సామాజిక సేవలు...

చర్చి నిర్వాహకులు 2000వ సంవత్సరం నుండి పథకాల విస్తరణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వివాహం, జన్మదినం, పెళ్లిరోజు, నామకరణం తదితర శుభకార్యక్రమాలు జరుపుకునేందుకు మందిరం ప్రాంగణంలో పెద్ద కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు క్లాస్ రూమ్ బాక్స్‌లు, పండుగల సీజన్‌లో ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక హాలు కూడా నిర్మించారు. 2001వ సంవత్సరంలో మత కర్మల కోసం చిన్న ప్రార్థనా మందిరం, 2002లో అమ్మవారి అద్భుతాలను వర్ణించే ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. తమ కోరికలను తీరుస్తున్న మేరీమాతకు కృతజ్ఞతలు తెలుపుతూ భక్తులు కానుకగా ఇచ్చే చీరలను మురికివాడలు, కాలనీలు, ఫుట్‌పాత్‌లపై నివసించే పేదప్రజలకు పంపిణీ చేస్తుంటారు. అలాగే ఉచిత వైద్యశిబిరాలు, రక్తదానం, నేత్రదానం, అవయవ దానం, అన్నదానం, రోడ్డుభద్రత, చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివాహం కానీ, యువతీ, యువకుల సంక్షేమార్థం 1981లో 'బీసెంట్‌నగర్ వేలాంకన్ని వివాహసేవ' పేరుతో ప్రతీనెల మొదటి శుక్ర, శనివారాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత ఆలయ ఫాదర్ అరుళప్ప పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా విజయకాంత్ జయంతి వేడుకలు





విజయకాంత్ చిత్ర పటానికి విశాల్ నివాళి - కెప్టెన్ జయంతి వేడుకల్లో సెల్వమణి, పేరరసు, ఆర్‌వీ ఉదయకుమార్ తదితరులు

అడయార్, ఆగస్టు 25 'ఆంధ్రజ్యోతి): దివంగత నటుడు, డీఎండీకే వ్యవస్థాపకుడు కెప్టెన్ విజయకాంత్ 73వ జయంతి వేడుకలను ఆయన అభిమానులు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో విజయకాంత్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యంగా తమిళ చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులు విజయకాంత్‌కు నివాళులర్పించి, ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అలాగే, అగ్ర హీరోలు కమల్ హాసన్, విజయ్ వంటివారు ఎక్స్ వేదికగా విజయకాంత్‌కు నివాళులర్పించారు. నడిగర్ సంఘం అధ్వర్యంలో ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్ తదితరులు కలిసి విజయకాంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే, ఊటీలో సినిమా షూటింగ్‌లో ఉన్న హీరో విశాల్.. లొకేషన్‌లోనే ప్రత్యేకంగా తయారు చేయించిన కెప్టెన్ చిత్ర పటానికి అంజలి ఘటించారు. వడపళనిలోని ఓ మాల్‌లో ఉన్న థియేటర్‌లో ప్రదర్శిస్తున్న 'కెప్టెన్ ప్రభాకరన్' చిత్రాన్ని ఆ చిత్ర దర్శకుడు ఆర్కే సెల్వమణి, నటుడు మన్సూర్ అలీఖాన్, సీనియర్ దర్శకులు ఆర్‌వీ ఉదయకుమార్, పేరరసు తదితరులు వీక్షించారు. ఆ తర్వాత థియేటర్ వెలుపల కేక్ కట్ చేసి విజయకాంత్ బర్త్‌డే వేడుకలను జరుపుకున్నారు. అలాగే కోయంబేడులోని విజయకాంత్ సమాధిని పలువురు సినీ ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు.

రామేశ్వరంలో 3.కి.మీ వెనక్కిమళ్ళిన సముద్రం

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా పాంబన్ చిన్న వంతెన, నడుతెరు, తోప్పుకాడు తదితర సముద్ర తీర ప్రాంతాల్లో సోమవారం ఉదయం సముద్రం సుమారు 3 కి.మీ.ల వరకూ వెనక్కిమళ్ళింది. దీంతో ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు, మత్స్యకారులు భీతిల్లారు. సముద్రం ఆకస్మికంగా వెనక్కిమళ్లటంతో తీరం పొడవునా ఉన్న పడవలన్నీ దెబ్బతిన్నాయి. దేశం నలుమూలల నుంచి రామేశ్వరానికి వచ్చిన భక్తులు సముద్రం వెనక్కి మళ్లటం చూసి ఆశ్చర్యపోయారు. ఇదిలా ఉండగా గాలివాటంలో ఏర్పడిన మార్పుల కారణంగా సముద్రం వెనక్కి మళ్ళిందని, ఈ సంఘటన వల్ల ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర మత్స్యశాఖ ఉన్నతాధికారులు ఓ ప్రకటన జారీ చేశారు.



వెల్లివాక్కం రూ.20.30 కోట్లతో నిర్మించిన బహుళ ప్రయోజనాల సామాజిక కేంద్రానికి భూమి పూజ చేస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు



చెన్నై నెహ్రూస్టేడియం వద్ద ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని మర్యాద పూర్వకంగా కలుసుకున్న 64వ జాతీయ అథ్లెటిక్స్ పోటీలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించి స్వర్ణపతకాలు గెలుచుకున్న రాష్ట్ర క్రీడాకారులు

సిటీ విజిటర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ యాప్ ప్రారంభం



యాప్ గురించి వివరిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు రూపొందించిన సిటీ విజిటర్ ఇన్ఫర్మేషన్ రికార్డు మేనేజ్‌మెంటు సిస్టమ్ (స్విరిమ్స్) యాప్‌ను సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన రాజు ఆవిష్కరించారు. దీనిద్వారా తిరుపతికి రోజుకు ఎంతమంది వస్తున్నారు? ఎక్కడ దిగుతున్నారు అనే వివరాలు తెలుస్తాయన్నారు. హోటళ్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తున్నామని, యాత్రికుల ఆధార్ కార్డు, అడ్రస్‌లు, లైవ్ ఫొటోలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల పూర్తి వివరాలు సేకరిస్తామని అన్నారు. ఇలా చేయడం వల్ల అసాంఘిక శక్తులను సులువుగా గుర్తించగలుగుతామని తెలిపారు.




మంత్రి నారాయణ - జస్టిస్ సందేశ్ - జస్టిస్ జోషి - జస్టిస్ ఎంకె థాక్కెర్ - జయం రవి - మాధవి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి నారాయణ, ఎంపీ మాగుంట శ్రీనివాసులు, తమిళ సినీ హీరో జయం రవి(రవిమోహన్), గాయని కెనిషా ఫ్రాన్సిస్, చిరంజీవి సోదరి మాధవి ఉన్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హెచ్‌పీ సందేశ్, జస్టిస్ సీఎం జోషి, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే థాక్కెర్ కూడా స్వామిని దర్శించుకున్నారు.

సర్వ దర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం : రూ.4.02 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 72,119

తలనీలాలు సమర్పించినవారు : 25,294

ఆడుదాం ఆంధ్రాకు రూ.119కోట్లు దారపోశారు

29న స్పోర్ట్స్ అకాడమీలపై ప్రకటన

శాప్ చైర్మన్ రవినాయుడు



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు రూ.119 కోట్లు కేటాయించి, దుర్వినియోగం చేశారని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆరోపించారు. నిధులు పూర్తిగా పక్కదారి పట్టినట్లు విచారణలో తేలిందని అన్నారు. అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా సోమవారం ఉదయం ఎస్వీక్యాంపస్ హైస్కూల్ మైదానంలో విలువిద్య పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో క్రీడా అకాడమీలు రద్దు చేసిందని, వాటిని మళ్లీ ప్రారంభిస్తామని, క్రీడా పాఠశాలల సంఖ్య పెంచుతామని, ఇంటర్ వరకు మంచి శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తామని వివరించారు. అమరావతి చాంపియన్‌షిప్‌లో పది క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. కేవలం రూ.కోటిన్నర నిధులతో క్రీడాకారులకు నాణ్యమైన పరికరాలు, సదుపాయాలు కల్పించామన్నారు. ప్రతి జిల్లాలోనూ క్రీడాకారులను గుర్తించి జోనల్, రాష్ట్రస్థాయి వరకు తెచ్చామని, విజేతలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని అన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా జాగ్రత్తపడ్డామన్నారు. ఒలింపిక్స్‌లో ఆంధ్రా క్రీడాకారులు మెడల్స్ సాధించాలనే లక్ష్యంతో కార్యాచరణ చేశామని స్పష్టం చేశారు. విజయవాడకు చెందిన విలువిద్య క్రీడాకారులు కె.ఝాన్సీలక్ష్మి, టి.భువనరాజేశ్వరి, కె.యుక్తశ్రీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఆడే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇక్కడే గట్టిపోటీ ఎదుర్కొనే అవకాశం లభించిందని, తద్వారా జాతీయ స్థాయి పోటీలు సులభమవుతాయని పేర్కొన్నారు. సాయంత్రం టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి క్రీడా మైదానాలను సందర్శించారు. క్రీడాకారులతో ముచ్చటిస్తూ చక్కగా రాణించాలని ఆకాంక్షించారు. కాగా ఐదు వేదికల్లో పది క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. మంగళవారం అంతిమ ఫలితాలు రానున్నాయి.

పోలీసు 'పీజీఆర్ఎస్'కు 106 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 106 ఫిర్యాదులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో ముక్కంటి ఆలయ సిబ్బంది దురుసు ప్రవర్తన

శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ సిబ్బంది తీరుతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం సిబ్బంది అనుసరించిన తీరు విమర్శలకు దారితీసింది. భక్తులకు అంతరాలయ దర్శనం చేరువ చేసేందుకు రూ.500 టిక్కెట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనికోసం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద నుంచి చెక్క మెట్లపై క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కాశీ అనే ఒప్పంద ఉద్యోగి టిక్కెట్లను తనిఖీ చేస్తుంటాడు. సోమవారం కొందరు మహిళా అధికారులు అంతరాలయ దర్శనానికి వెళుతుండగా కాశీ మెట్లపై అడ్డంగా కూర్చున్నాడు. వారు పక్కకు జరగాలని కోరడంతో ఆగ్రహంతో పోతేపోండి అంటూ దురుసుగా ప్రవర్తించాడు. అలాగే కొందరు అర్చకులు హారతి పళ్లేలతో క్యూ వద్దనే అడ్డంగా నిలబడి దక్షిణ సమర్పిస్తేనే హారతి ఇస్తూ భక్తుల పట్ల కస్సుబుస్సులాడారు. అలాగే అమ్మవారి సన్నిధిలోనూ కొందరు సిబ్బంది దళారులకు రాచబాట వేస్తున్నారు. ఇక అక్కడ పనిచేసే ఓ ఉద్యోగి దురుసుగా వ్యవహరించడంపై సోమవారం పలువురు భక్తులు విస్మయం చెందారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మూడు నెలల గడువు ఇచ్చిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌కు లేఅవుటు రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి, సమీప ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు అధికంగా ఉన్నాయని, ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

మారథాన్‌లో రామకృష్ణ ప్రతిభ



హైదరాబాదులో జరిగిన హాఫ్ మారథన్‌లో రామకృష్ణ

చంద్రగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కల్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల సీఐ రామకృష్ణ ఈనెల 24న జరిగిన మారథాన్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లో జరిగిన హాఫ్ మారథన్ పోటీల్లో ఆయన 1.45 గంటల్లో 21 కిలోమీటర్లు పరుగెత్తారు. గతం కంటే ఈసారి ఐదు నిమిషాలు ముందుగా లక్ష్యాన్ని చేరుకున్నారు. అమెరికాలోని బోస్టన్ జరిగే మారథన్‌లో పాల్గొనేందుకు రామకృష్ణ పట్టుదలతో సాధన చేస్తున్నారు. ఇప్పటికే దేశంలో వివిధ ప్రధాన కేంద్రాలలో జరిగిన మారథాన్ పోటీల్లో పాల్గొన్నారు. బోస్టన్ పోటీలో పాల్గొనాలంటే 3 గంటల్లో 42 కిలోమీటర్లు చేరుకోవాల్సి ఉంటుందని, ఇప్పటికన్నా మరింత మెరుగుపడేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వీఆర్‌కు ఎస్ఐ గిరిబాబు

తిరుపతి(నేర విభాగం) ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఎస్ఐ గిరిబాబును వీఆర్‌కు పంపుతూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎయిర్‌బైపాస్ ఘటనలో వైఫల్యంతో పాటు పలు కారణాలతో బదిలీ చేస్తున్నట్లు ఎస్పీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన పనితీరు, వ్యవహారశైలిపై విచారణకు ఆదేశించారు.

మేము దివ్యాంగులమే..పెన్షన్ రద్దు చేయకండి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు పోటెత్తిన ప్రత్యేక ప్రతిభావంతులు - ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'మేమంతా దివ్యాంగులమే.. కొంతమంది నడవలేని స్థితిలో ఉన్నారు.. మరికొందరు కదల్లేని స్థితిలో ఉన్నారు.. వందశాతం వికలత్వం ఉన్నా 40 శాతానికి తగ్గించి పింఛన్లు రద్దు చేస్తామంటూ నోటీసులు పంపారు. మా కడుపు కొట్టకండి' అంటూ పలువురు దివ్యాంగులు కలెక్టర్ వెంకటేశ్వర్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు దివ్యాంగులు పెద్దయెత్తున రావడంతో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా వైద్యశాఖాధికారి బాలకృష్ణనాయక్ వారినుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 321 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 151 ఉన్నాయి.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రీ వెరిఫికేషన్‌లో అన్యాయం చేశారు



ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. మంచానికే పరిమితమయ్యా. ఇటీవల మా ఇంటికి వైద్యబృందం వచ్చి 89శాతం ఉన్న వికలత్వాన్ని 49శాతం మాత్రమే ఉందని రాశారు. దీంతో రూ.15వేలు వచ్చే పింఛను రూ.6వేలు చేశారు. వైద్యబృందం అన్యాయం చేసింది.. మీరైనా న్యాయం చేయండి.

- కార్తికేష్, నారాయణవనం

నా భూమిని వేరేవారి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు



వంశపారంపర్యంగా ఆలత్తూరు రెవెన్యూ లెక్కదాఖల్లో 2.60ఎకరాలు కలిగి ఉన్నాను. ఈ భూమిని వీఆర్వో, రెవెన్యూ అధికారులు నాకు తెలియకుండా వేరే ఇద్దరి పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీనిపై రెవెన్యూ సదస్సులోనూ ఫిర్యాదు చేశాను. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. మీరైనా న్యాయం చేయండి.

- చెంగారెడ్డి, ఆలత్తూరు, బీఎన్‌కండ్రిగ

వికలత్వం తక్కువగా ఉందని పింఛను తొలగిస్తామన్నారు..



ఎన్నో ఏళ్లుగా నడవలేని స్థితిలో ఉన్నాను. రూ.6వేలు పింఛను వచ్చేది. రీ వెరిఫికేషన్ పేరుతో వికలత్వాన్ని 40శాతం కంటే తక్కువగా చేయడంతో పింఛను తొలగించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పింఛను రద్దు చేయడం దుర్మార్గం. పునఃపరిశీలన చేయండి.

- లక్ష్మీనారాయణ, దివ్యాంగుడు, సప్తగిరికాలనీ, మంగళం

తొలగించిన పింఛన్లను పునరుద్ధరించండి



కలెక్టరేట్ ఎదుట వికలాంగుల ఆందోళన

తొలగించిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్లు తొలగించి వారి గొంతుకోసే ప్రయత్నం చేస్తోందన్నారు. తిరుపతి జిల్లాలో రీవెరిఫికేషన్ పేరుతో 25వేల మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రీవెరిఫికేషన్ పేరుతో తప్పుడు ధృవపత్రాలు ఇచ్చిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

చిన్నతనంలోనే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి



పోలియో కారణంగా చిన్నపుడే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. రూ.70 నుంచి పింఛను అందుకుంటున్నాను. 90శాతం వైకల్యం ఉన్నా వైద్యులు రీవెరిఫికేషన్ పేరుతో వికలత్వం తగ్గించారు. ఇలా చేయడం సబబుకాదు. పునఃపరిశీలించి పింఛను అందజేయాలి.

- శ్రీనివాసులు, తిరుపతి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. రూ.6,400కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరారు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు రాయాలని విద్యార్థులను యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయన్నారు. సెలవు రోజుల్లోనూ ప్రైవేటు విద్యాసంస్థలు తరగతులు నిర్వహించి విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని తెలిపారు. తిరుపతి, చంద్రగిరిలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, వర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.





హెల్ప్‌డెస్క్‌లో దివ్యాంగులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

వింగ్‌టెక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

వింగ్‌టెక్ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. చైనాకు చెందిన వింగ్‌టెక్ యాజమాన్యం ప్రభుత్వానికి ఇచ్చిన హామీకి భిన్నంగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలేదని ఆరోపించారు. పూర్తిస్థాయిలో రాయితీలు పొంది ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు, పన్నులు చెల్లించకపోగా కార్మికులకు ద్రోహం చేస్తోందని వివరించారు. ఈ మేరకు కలెక్టర్‌కు విన్నవించారు. అదేవిధంగా సమస్యలను పరిష్కరించాలని ఏపీ రజకవృత్తిదారుల సంఘం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సంఘ నాయకులు కోరారు.



ఆందోళన చేస్తున్న వింగ్‌టెక్ పరిశ్రమ ఉద్యోగులు

ఏడు ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందనంతో ఫారెస్టు అధికారులు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. సోమవారం తెల్లవారుజామున ఎల్లమంద వై-జంక్షన్ వద్ద ఫారెస్టు సిబ్బంది కాపు కాచి ఉన్నారు. అదే సమయంలో ఉస్తికాయలపెంట నుంచి అతివేగంగా ఓ కారు రావడాన్ని గుర్తించారు. ఆపేందుకు విఫలయత్నం చేసి వెంబడించారు. దీంతో కొంతదూరంలో కారును చెట్ల మధ్య ఆపి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. కారులో పరిశీలించగా 160 కేజీల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.8 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. దాడిలో రేంజ్ ఆఫీసర్ వెంకటరమణతోపాటు సిబ్బంది మునిస్వామి నాయక్, లక్ష్మీప్రసాద్, సదాశివయ్య, రాజేష్ కుమార్ ,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ, ఆదాయ పన్నులపై అవగాహన అవసరం

ఎప్పటికప్పుడు మార్పులను తెలుసుకోవాలి ● జీఎస్టీ అదనపు కమిషనర్ శర్మ



ట్యాక్స్ ప్రాక్టీషనర్ల అవగాహన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శర్మ తదితరులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో రోజురోజుకూ మారుతున్న జీఎస్టీ విధానాలు, ఆదాయ పన్ను చెల్లింపుల్లో ఉన్న లొసుగులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని జీఎస్టీ అదనపు కమిషనర్ శర్మ సూచించారు. తిరుపతిలోని ఒక ప్రైవేటు హోటల్‌లో సోమవారం రాష్ట్ర, జిల్లా స్థాయి ఆడిటర్లు, ట్యాక్స్ ప్రాక్టీషనర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ శిరీష మాట్లాడుతూ తాను డాక్టర్‌గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ కొత్త విధానాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జీఎస్టీ అదనపు కమిషనర్ శర్మ మాట్లాడుతూ ఆడిటర్లు, ట్యాక్స్ ప్రాక్టీషనర్లు రిటర్నులు దాఖలు చేయడం, ట్యాక్స్ పే చేయడానికి అవసరమైన విధానాలపై, టెక్నాలజీపై అవగాహన పెంచుకుని సకాలంలో పన్నులు చెల్లించి దేశ, రాష్ట్ర పురోగతికి సహకరించాలన్నారు. ట్యాక్స్ ప్రాక్టీషనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, చైర్మన్ శ్రీనివాసరెడ్డి, తిరుపతి అధ్యక్షుడు సునీల్ అహ్మద్, లోకల్ అధ్యక్షుడు మునికృష్ణయ్య, సీనియర్ ఆడిటర్ ఫల్గుణకుమార్, గల్లా ప్రవీణ్‌కుమార్, ఆడిటర్లు పాల్గొన్నారు.

ఖో-ఖో విజేతలుగా జోన్ 2ఉమెన్, 3మెన్ జట్లు



పరుగు పందెం, వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్



బాస్కెట్‌బాల్ విజేత జోన్ 1 ఉమెన్ జట్టు - బాస్కెట్‌బాల్ విజేత జోన్ 1 మెన్ జట్టు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలు రెండో రోజైన సోమవారం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. సాయంత్రానికి ఖో-ఖోలో తుది ఫలితాలు వచ్చాయి. మెన్ విభాగంలో జోన్ 3 జట్టు, ఉమెన్ విభాగంలో జోన్ 2జట్టు విజేతలుగా నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో జోన్1 ఉమెన్, జోన్ 1మెన్ జట్లు గెలుపొందాయి. ఎస్వీయూ క్యాంపస్‌స్కూల్ మైదానంలో ఆర్చరీ, వాలీబాల్, ఎస్వీయూ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఇండోర్‌హాల్లో బాక్సింగ్ పోటీలు, శ్రీనివాస క్రీడా సముదాయంలో కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. శాప్ చైర్మన్ రవినాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, శాప్ డైరెక్టర్లు రజనీ, రవీంద్రనాథ్, సంతోష్‌కుమార్, డీఎస్‌డీవోలు శశిధర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ విజేత జోన్ 2 మెన్ జట్టు, ఆర్చరి, బాక్సింగ్, కబడ్డీ

15 కేజీల గంజాయి స్వాధీనం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నై రహదారి సమీపంలో 15 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి 15 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

28న అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కేవీఎస్ మైదానంలో ఈనెల 28న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడిజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్‌రాజనందన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగంలో బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆరోజున ఉదయం 8గంటలకు ఆధార్, జనన ధృవీకరణ పత్రం జిరాక్సులతో తప్పనిసరిగా మైదానానికి చేరుకోవాలి. మరిన్ని వివరాల కోసం 86868 67079 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.